నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, గురువారం 15 ఆగస్టు 2024 SIDDIPET




ట్రిపుల్‌ఆర్‌పై మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో రైతులతో కలిసి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

# ట్రిపుల్ ఆర్‌పై అన్నదాతల ఆందోళన

## ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణపై తిరగబడుతున్న రైతులు

- మారుతున్న డిజైన్లతో పెరుగుతున్న భూసేకరణ
- తొలుత 659.53 ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయం
- అలైన్‌మెంట్ మార్పుతో 853 ఎకరాలకు పెరిగిన భూసేకరణ
- పెద్దాపూర్ సమీపంలో డంబెల్ ఇంటర్‌చేంజ్ నిర్మాణానికి ప్రతిపాదన
- డంబెల్ ఇంటర్‌చేంజ్‌తో అదనంగా 90 ఎకరాల భూసేకరణ
- భూములు ఇచ్చేది లేదంటున్న పెద్దాపూర్, గిర్మాపూర్ రైతులు

సంగారెడ్డి, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ):రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్‌ఆర్) భూసేకరణపై సంగారెడ్డి జిల్లాలోని రైతులు తిరగబడుతున్నారు. ఆర్‌ఆర్‌ఆర్‌కు భూములు ఇచ్చేదిలేదని రైతులు ఆందోళనకు దిగుతున్నారు. విలువైన తమ భూములను సేకరించవద్దని సర్వే పనులను అడ్డుకుంటున్నారు. ప్రభుత్వం భూసేకరణ సర్వే పనులను అడ్డగిస్తున్న రైతులను అరెస్టులు చేస్తుండడంతో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం డిజైన్లు మాటిమాటికి మారుస్తున్నది. దీంతో రైతుల నుంచి సేకరించాల్సిన భూముల విస్తీర్ణం వందల ఎకరాలు పెరుగుతున్నది. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం పేరిట ఏడాదికి రెండు పంటలు పండే విలువైన తమ భూములను తీసుకోవడంపై రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ కోసం ఇది వరకు సంగారెడ్డి జిల్లాలోని చౌటకూరు, హత్నూర మండలాల్లోని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆందోళనలకు దిగారు. ఇటీవల సదాశివపేట మండలానికి చెందిన పెద్దాపూర్, కొండాపూర్ మండలానికి చెందిన గిర్మాపూర్ రైతులు ఆర్‌ఆర్‌ఆర్‌కు భూములు ఇచ్చేదిలేదంటూ ఆందోళనకు దిగారు. గురువారం ఆర్‌ఆర్‌ఆర్ డిజిటల్ సర్వే పనులను పెద్దాపూర్, గిర్మాపూర్ రైతులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. కాగా, శుక్రవారం సైతం రైతులు ఆర్‌ఆర్‌ఆర్‌కు భూములు ఇవ్వమంటూ ఆందోళనకు దిగారు. పెద్దాపూర్, గిర్మాపూర్‌తోపాటు సంగారెడ్డి, చౌటకూరు, హత్నూర మండలాల్లో భూముల విలువ కోట్ల రూపాయలు పలుకుతున్నది. దీంతో రైతులు భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. వారసత్వంగా ఏండ్ల తరబడి వస్తున్న తమ భూములను రోడ్ల నిర్మాణానికి లాక్కుంటే తమ కుటుంబాలు జీవనాధారం కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### 853 ఎకరాల భూములు సేకరణ

రాష్ట్ర ప్రభుత్వం 333 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించేందుకు సిద్ధమవుతున్నది. ఉత్తర భాగంలో 158 కిలోమీటర్లు, దక్షిణ భాగంలో 175 కిలోమీటర్లమేర ఆర్‌ఆర్‌ఆర్ నిర్మించనున్నది. ఉత్తర, దక్షిణ భాగం కలిపి సంగారెడ్డి జిల్లాలో 27.5 కిలోమీటర్ల మేర ఆర్‌ఆర్‌ఆర్ నిర్మించనున్నారు. ఇందుకోసం మొదట సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్, హత్నూర మండలాల్లోని 11 గ్రామాల్లో 361.23 ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయించారు. చౌటకూరు మండలంలోని ఐదు గ్రామాల్లో 298.3 ఎకరాల భూమి సేకరణకు సర్వే జరిపారు. మొత్తంగా సంగారెడ్డి జిల్లాలో 659.53 ఎకరాల భూమి సేకరణకు నిర్ణయించారు. ఈ మేరకు అధికారులు సర్వే పనులు మొదలు పెట్టారు. సదాశివపేట, కొండాపూర్ మండలాల్లో డిజిటల్ సర్వే పనులు మొదలు పెట్టగా రైతులు అడ్డుకుంటున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ డిజైన్ల మార్పుతో సంగారెడ్డి జిల్లాలో భూసేకరణ విస్తీర్ణం క్రమంగా పెరుగుతున్నది. ఇది వరకు 659.53 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, అధికారవర్గాల సమాచారం మేరకు భూ సేకరణ విస్తీర్ణం 853 ఎకరాలకు పెరిగినట్లు తెలిసింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల ట్రిపుల్‌ఆర్‌పై మెదక్ జిల్లా రెడ్డిపల్లిలో అధికారులతో వాగ్వాదానికి దిగుకున్న రైతులు

### డిజైన్ల మార్పుతో పెరుగుతున్న భూసేకరణ విస్తీర్ణం

ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణ డిజైన్లు మాటిమాటికి మార్చుతుండడంతో సేకరించాల్సిన భూ విస్తీర్ణం క్రమంగా పెరుగుతున్నది. ఇది వరకే జిల్లాలోని రైతులు ఆర్‌ఆర్‌ఆర్‌కు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేరు. డిజైన్ల మార్పుతో మరింత భూసేకరణ చేయాల్సి వస్తుండటంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంలో సంగారెడ్డి, కొండాపూర్,సదాశివపేట, హత్నూర మండలాల్లో మొదట 361.23 ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయించారు. డిజైన్ల మార్పు కారణంగా ఇప్పుడు భూసేకరణ విస్తీర్ణం 555 ఎకరాలకు పెరిగింది. జాతీయ రహదారులపై వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలుగకుండా ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం డిజైన్లు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారిపై వాహనాలు సులువుగా ప్రయాణించేందుకు మొదట పెద్దాపూర్ వద్ద ఇంటర్‌చేంజ్ నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇంటర్‌చేంజ్ నిర్మాణానికి పెద్దాపూర్, గిర్మాపూర్ గ్రామాల మధ్య 107 ఎకరాల భూమి అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు ఇంటర్‌చేంజ్ నిర్మాణానికి సిద్ధమయ్యారు. కాగా, ప్రభుత్వం తాజాగా పెద్దాపూర్ వద్ద 'డంబెల్ ఇంటర్‌చేంజ్' నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారికి ఇరువైపులా డంబెల్ ఆకారంలో ఇంటర్‌చేంజ్‌లను నిర్మిస్తారు. తద్వారా జాతీయ రహదారితో సంబంధం లేకుండానే ఆర్‌ఆర్‌ఆర్ పై ప్రయాణించే వాహనదారులు రాకపోకలు సాగించవచ్చు. డంబెల్ ఇంటర్‌చేంజ్‌ల నిర్మాణంతో ఆర్‌ఆర్‌ఆర్‌పై ప్రయాణించే వాహనదారులు సులువుగా అటు హైదరాబాద్ వైపు ఇటు ముంబయి వైపు వెళ్లే జాతీయ రహదారులకు చేరుకోవచ్చు. కాగా, పెద్దాపూర్ వద్ద 'డంబెల్ ఇంటర్ చేంజ్' నిర్మాణంతో అదనంగా 86 నుంచి 100 ఎకరాల వరకు భూమి సేకరించాల్సి వస్తున్నది. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డంబెల్ ఇంటర్‌చేంజ్ నిర్మాణంతో పెద్దాపూర్, గిర్మాపూర్ గ్రామాల రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. దీంతో రెండు గ్రామాల రైతులు ఆర్‌ఆర్‌ఆర్‌కు భూములు ఇచ్చేది లేదని ఆందోళన చేస్తున్నారు. బుధవారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ను కలిసి రైతుల ఆందోళనను వివరించారు. బలవంతంగా భూసేకరణ తగదని, రైతులకు సమాచారం ఇవ్వకుండా భూసర్వే ఎలా చేస్తారని ఎమ్మెల్యే అదనపు కలెక్టర్‌ను ప్రశ్నించారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

### ట్రిపుల్‌ఆర్‌కు భూమి ఇయ్యం



కొండాపూర్, ఆగస్టు 14: ట్రిపుల్‌ఆర్‌కు భూములు ఇచ్చే ప్రసక్తే లేదు. నాకు ఉన్న 3 ఎకరాల ఐదు గుంటల భూమి మొత్తం పోతే మేం ఎట్లా బతకాలి. ప్రభుత్వం మా భూముల వద్దకు రావొద్దు. ప్రభుత్వ భూములను వదిలి పంట భూముల నుంచి ట్రిపుల్‌ఆర్‌ను తీసుకెళ్లడం సమంజసం కాదు. మా బిడ్డల బతుకులు రోడ్డు పాలు చేయకండి. రూ. 4 నుంచి రూ.6 కోట్లు పలికే విలువైన భూములను వదులుకోం.

- వేణుగోపాల్, రైతు, గిర్మాపూర్, సంగారెడ్డి జిల్లా

### భూమికి భూమి ఇవ్వాలి



కొండాపూర్, ఆగస్టు14: భూమికి భూమి ఇవ్వాలి లేదంటే మొత్తం అలైన్‌మెంట్ మార్చాలి. మేము చిన్న సన్నకారు రైతులం. మాకు ఉన్న ఐదు ఎకరాల పొలం ట్రిపుల్‌ఆర్‌లో పోతే మా బతుకుదెరువు ఆగమైతది. మాకు బతుకుదెరువు కావాలంటే ప్రభుత్వం భూమికి భూమి ఇప్పించాలి లేదంటే ట్రిపుల్‌ఆర్‌కు సంబంధించిన రోడ్డు మ్యాపును మొత్తానికే తొలిగించాలి. లేదంటే మార్కెట్ ధర చెల్లించాలి.

- పట్లోళ్ల ఆంజనేయులు, రైతు, గిర్మాపూర్, సంగారెడ్డి జిల్లా

### అలైన్‌మెంట్ మార్చాలి



కొండాపూర్, ఆగస్టు14: మా నాయన పేరు మీద ఉన్న భూమి ఎకరం 15 గుంటలు పోతున్నది. నా పేరుమీద ఉన్న భూమి 30 గుంటలు పోతున్నది. మా నాయన పేరు మీద ఉన్న భూమి ప్రస్తుతం ఎకరాకు రూ.4 కోట్లు, నా పేరు మీద ఉన్న భూమి రూ.6 కోట్లు పలుకుతున్నది. ట్రిపుల్‌ఆర్ వల్ల గిర్మాపూర్‌కు ఎలాంటి ప్రయోజనం లేదు. పక్కనే ప్రభుత్వ భూమి ఉన్నా మా పొలాలను తీసుకుంటున్నారు. మాకు భూమికి భూమి ఇవ్వాలి లేదంటే అలైన్‌మెంట్ మార్చాలి.

- పట్లోళ్ల యాదగిరి, రైతు, గిర్మాపూర్, సంగారెడ్డి జిల్లా



సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్‌లోకి పంపింగ్ అవుతున్న గోదావరి జలాలు

## మల్లన్నసాగర్‌లోకి గోదావరి పరవళ్లు

- కొనసాగుతున్న ఎత్తిపోతలు
- రిజర్వాయర్‌లో 9.75 టీఎంసీల నీటి నిల్వ

తొగుట, ఆగస్టు 14: మల్లన్నసాగర్ ప్రాజెక్టులో 9.75 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయని మల్లన్నసాగర్ డీఈఈ శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల పాటు తుక్కాపూర్ పంప్‌హౌస్ నుంచి నాలుగు పంపుల ద్వారా పంపింగ్ జరుగుతుందని చెప్పారు. అందులో నుంచి 0.8 టీఎంసీల నీటిని అదే మోతాదులో కొండపోచమ్మసాగర్‌కు ఎత్తిపోస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 2.6 టీఎంసీలు పంపింగ్ జరిగిందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మరో నాలుగు రోజులపాటు పంపింగ్ కొనసాగుతుందని చెప్పారు.



బుధవారం మెదక్ జిల్లా దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## 24 గంటలు రోగులకు సేవలందించాలి

- సరిపడా మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్
- జిల్లా దవాఖాన ఆకస్మిక తనిఖీ, వైద్యాధికారులతో సమీక్ష

మెదక్, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా దవాఖానను బుధవారం కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేసి, వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు. మెడికల్ స్టోర్ రూమ్‌ను పరిశీలించి మందుల వివరాలను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల వైద్యులు సమన్వయంతో పనిచేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దవాఖానల్లో ల్యాబ్‌లు 24 గంటలు పనిచేసి రోగులకు ఫలితాలు వేగంగా అందించాలన్నారు. సరిపడా పరీక్షల కిట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని అధికారులకు ఆయన సూచించారు. సమీక్షలో డీఎంహెచ్‌వో శ్రీరామ్, జిల్లాదవాఖాన సూపరింటెండెంట్ శివదయాళ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మంజీరా అభయారణ్యానికి
## రాంసార్ గుర్తింపునకు ప్రతిపాదనలు

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

కంది, ఆగస్టు 14: సంగారెడ్డి జిల్లా మంజీరా బ్యారేజ్ సమీపంలో ఉన్న మంజీరా అభయారణ్యానికి రాంసార్ గుర్తింపునకు ప్రతిపాదనలు పంపినట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. స్టేట్‌విట్ ల్యాండ్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో ఐఏఎస్ అధికారుల బృందం బుధవారం మంజీరా అభయారణ్యాన్ని సందర్శించింది. బయోడైవర్సిటీ కార్యక్రమంలో భాగంగా మంజీరా అభయారణ్యాన్ని రాంసార్ గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపినట్టు బృందం తెలిపింది. మంజీరా అభయారణ్యం మంజీరా నది 9 దీవుల్లో 550 ఎకరాల్లో విస్తరించి ఉందని, సుమారు 300 రకాల పక్షులు, 160 ఇతర జీవులు ఈ దీవుల్లో నివసిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఆయా సీజన్లకు అనుగుణంగా వివిధ రకాల వలస పక్షులు మంజీరాకు వలస వస్తున్నట్లు తెలిపారు. రాంసార్ గుర్తింపుతో మంజీరా అభయారణ్యానికి ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. బోటులో ఐఏఎస్ బృందం సభ్యులు మంజీరాలోని 9 దీవుల్లో విస్తరించి ఉన్న వైల్డ్‌లైఫ్ శాంక్చురీని సందర్శించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు కీర్తిమాన వస్తి, కల్పైరసన్, డాక్టర్ జాన్సె మాత్యు, వికాస్ చంద్రగుప్తా, సంగారెడ్డి జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.



బైనాక్యులర్‌తో మంజీరా నదిని తిలకిస్తున్న బృందం సభ్యులు, పక్కన కలెక్టర్ వల్లూరు క్రాంతి

## నిర్ఫ్ ర్యాంకింగ్ ఉత్సాహం నింపింది

**ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి**

సంగారెడ్డి ఆగస్టు 14(నమస్తే తెలంగాణ):ఐఐటీహెచ్‌కు నిర్ఫ్ ర్యాంకింగ్‌లో 12వ స్థానం లభించడం ఎంతో ఉత్సాహం ఇచ్చిందని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్.మూర్తి తెలిపారు. నిర్ఫ్ 2024 ర్యాంకింగ్‌పై ఆయన స్పందిస్తూ నిర్ఫ్ ఓవరాల్ ర్యాంకింగ్‌లో గతేడాది 14వ స్థానంలో ఉండగా ఈసారి 12వ స్థానం, నూతన ఆవిష్కరణల్లో 3వ ర్యాంకు, ఇంజినీరింగ్‌లో 8వ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. 16 ఏండ్లల్లో ఐఐటీ హైదరాబాద్ అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది సమష్టి కృషి కారణమన్నారు. నిర్ఫ్ తాజా ర్యాంకింగ్‌తో మరింత ముందుకెళ్తామని, దేశంలోనే అత్యుత్తమ సాంకేతిక విద్యాసంస్థగా ఎదిగేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. నిర్ఫ్‌లో అత్యుత్తమ ర్యాంకుల సాధనకు కృషి చేసిన ఐఐటీహెచ్ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

### 18న ఫ్యూచర్ ఇన్నోవేషన్ ఫెయిర్

ఐఐటీ హైదరాబాద్‌లో ఈనెల 18న ఫ్యూచర్ ఇన్నోవేషన్ ఫెయిర్ -2024 జరగనున్నది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులను పరిశోధనలు, నూతన ఆవిష్కరణలవైపు మళ్లించేందుకు ఐఐటీ హైదరాబాద్ ఏటా ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నది. గతేడాది ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్.మూర్తి పర్యవేక్షణలో ఇన్నోవేషన్ ఫెయిర్ విజయవంతం చేశారు. ఈ ఏడాదికి ఈనెల 18న ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించనున్నారు. తెలంగాణలోని 8, 9 తరగతి చదువుతున్న 25కుపైగా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇన్నోవేషన్ ఫెయిర్‌లో పాల్గొని తమ ఆవిష్కరణలు ప్రదర్శించనున్నారు. ఉత్తమ ఆవిష్కరణలకు మొదటి బహుమతిగా రూ.20వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు అందజేయనున్నారు.



సిద్దిపేట జిల్లా ఎన్సాన్‌పల్లి గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

## విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

**సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి**

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 14: నాణ్యమైన వంట పదార్థాలు వాడి విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా..అని ఆరా తీశారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేక కుక్కలు, పందులు లోపలికి వస్తున్నాయని, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలని సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థుల కోసం వండిన వంటను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి అసౌకర్యాలకు గురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ లక్ష్యాలను చేరుకునే విధంగా విద్యాభ్యాసం కొనసాగించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు, డ్రైనేజీ నీరు ఆగిన చోట ఇంకుడు గుంత ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మనుచౌదరి వెంట పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## విద్యారంగ అభివృద్ధికి రూ.5వేల కోట్లు కేటాయింపు

- గురుకులాల్లో నెలకొన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తాం
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు గురుకులాలను సందర్శించాలి
- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మీడియా చిట్‌చాట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 14: విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. పెద్దాపురం గురుకులంలో జరిగిన సంఘటన మళ్లీ పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారన్నారు. విద్యారంగానికి కేటాయించిన నిధులతోపాటు ఈజీఎస్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నిధులను గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లు, విద్యాలయాల అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు నిత్యం గురుకులాలను సందర్శించాలని, అక్కడి సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. గురుకులాల్లో పరిశుభ్రత కోసం స్థానికంగా నిధులు కేటాయించి పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. సొంత భవనం లేని ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లు, పాఠశాలల భవన నిర్మాణానికి స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించామని, స్థలం లభించగానే భవన నిర్మాణాలకు నిధులు వెంటనే మంజూరు చేస్తామని వివరించారు. హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో చదువుకొని ఉద్యోగం లేక వ్యవసాయం చేస్తున్న యువతకు కూడా వ్యవసాయాధారిత రంగాలు, పరిశ్రమల్లో ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సొంతంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు ఇప్పించేందుకు కూడా ఆలోచన చేస్తున్నామన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో మరో 11 జీపీలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 14: సంగారెడ్డి జిల్లాలో మరో 11 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు ఉండగా, కొత్త పంచాయతీలతో కలిపి ఆ సంఖ్య 658 కానున్నది. అందోల్ డివిజన్‌లో మూడు గ్రామ పంచాయతీలు, జహీరాబాద్ డివిజన్‌లో ఒకటి, సంగారెడ్డి డివిజన్‌లో ఏడు గ్రామ పంచాయతీలు ఏర్పడనున్నాయి. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో అందోల్ డివిజన్‌కు సంబంధించి అందోల్ మండలంలో కొండారెడ్డిపల్లి తండా, వట్‌పల్లి మండలంలో లక్యానాయక్ తండా, రాయికోడ్ మండలంలో ఎంకెపల్లి, జహీరాబాద్ డివిజన్‌కు సంబంధించి న్యాల్‌కల్ మండలంలో తాట్పల్లి, సంగారెడ్డి డివిజన్‌కు సంబంధించి సదాశివపేట మండలంలో ముబారక్‌పూర్(బీ), నారాయణఖేడ్ మండలంలో అత్యధికంగా ఆరు గ్రామ పంచాయతీలు హనుమాన్ మందిర్ తండా, లింగనాయక్‌పల్లి, గుండు తండా, పాత్ర్యనాయక్ తండా, ఉమ్లా తండా, శ్యామ్‌నాయక్ తండాలు ఉన్నాయని జిల్లా పంచాయతీ శాఖ అధికారి సాయిబాబా తెలిపారు.




హుస్నాబాద్‌లో బోడ కాకరకాయలు, కొనుగోలు చేస్తున్న జనం

## 'బోడ కాకరకాయ'కు భలే గిరాకీ

హుస్నాబాద్, ఆగస్టు 14: వానకాలం సీజన్‌లో కూరగాయల మార్కెట్, ప్రధాన కూడళ్లలో బుట్టలు, తట్టల్లో ఎక్కువగా దర్శనమిస్తాయి బోడ కాకరకాయలు. ఇవి వానకాలం సీజన్‌లోని జూలై, ఆగస్టుతోపాటు సెప్టెంబర్ ప్రథమార్థంలో మాత్రమే మార్కెట్‌లో లభిస్తాయి. దీనిని అడవి కాకర అని కూడా అంటారు. దీని రుచి ఒకసారి చూశారంటే మళ్లీ మళ్లీ తినాలనిపించే విధంగా ఉంటుంది. అటవీప్రాంతంలో ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా పండే ఈ కూరగాయను ప్రతిఒక్కరూ ఇష్టంగా తింటారు. వానకాలం ప్రారంభంలో కిలో రూ.400లకు పైగా ధర పలికిన ఈ బోడ కాకరకాయ ప్రస్తుతం కాత ఎక్కువగా వస్తుండటంతో రూ.200 వరకు మార్కెట్‌లో అమ్ముతున్నారు. అటవీజాతి పంట గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు, రైతులకు మంచి ఉపాధి ఇస్తున్నది.

## అమీన్‌పూర్‌లో పర్యటించిన హైడ్రా కమిషనర్



అమీన్‌పూర్ చెరువుల ఆక్రమణలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

అమీన్‌పూర్, ఆగస్టు 14: ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలు చేసే వారిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించవద్దని స్థానిక అధికారులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. బుధవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువు, బంధం కొమ్ము చెరువు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, చెరువు, సాగునీటి కాలువలు తదితర ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు నష్టం జరగకుండా చెరువులను, కుంటలను కాపాడుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. అందులో భాగంగానే అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, కుంటలు, కాలువల తనిఖీకి వచ్చామన్నారు. పలు ప్రాంతాలను పరిశీలించిన తర్వాత ఆక్రమణలకు గురైన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, కాలువలను ఆయన పరిశీలించి అక్కడున్న అక్రమ నిర్మాణాలను స్వయంగా గుర్తించారు. కమిషనర్ వెంట హైడ్రా డీఎస్పీ శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ రామస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి పవన్, హైడ్రా అధికారులు ఉన్నారు.